

ఆధిక్యంలో బీజేపీ

- గట్టి పోటీ ఇస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి
- ఉదయం 11.30కు ప్రారంభమైన ఓట్ల లెక్కింపు
- ఇంకా చెల్లని ఓట్లు వస్తుండడంతో నిర్ధారణ కాని కోటా ఓట్లు
- ఇంకా తమకు అవకాశముందంటున్న కాంగ్రెస్ నాయకులు


ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది

కరీంనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో ప్రతి రౌండ్‌లోనూ బీజేపీ ఆధిక్యం కనబరిచింది. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య నువ్వా.నేనా అన్నట్లుగా హోరాహోరీగా ఎన్నికలు జరుగగా ఫలితాలు మాత్రం బీజేపీకే అనుకూలంగా వస్తున్నాయి. బీసీ వాదం బలంగా వీయడంతో గట్టి పోటీ ఇచ్చి రెండో ప్రాధాన్య ఓట్లతో గెలిచే అవకాశాలుంటాయని భావించిన బీఎస్పీ అభ్యర్థి మూడో స్థానానికే పరిమిత మయ్యారు. మొత్తం 11 రౌండ్లలో ఓట్లను లెక్కించనుండగా రాత్రి 12 గంటల వరకు ఆరు రౌండ్ల ఫలితాలు వెలువ డ్డాయి. ఆరు రౌండ్లు ముగిసే వరకు బీజేపీ అభ్యర్థి సి అంజిరెడ్డి తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డి కంటే 7,118 ఓట్ల ఆధిక్యం కనబరిచారు. మొదటి ప్రాధాన్య ఓట్లు బుధవారం మధ్యాహ్నం వరకు లెక్కింపు పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొదటి ప్రాధాన్య ఓట్లతో కోటా ఓట్లు వచ్చే అవకాశాలు లేకపోవడంతో రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపుతోనే గెలుపు ఖాయమవుతుందని అంచనా వేస్తున్నారు.

ఒక్కో రౌండ్‌లో 21 వేల ఓట్లు

ఓట్ల లెక్కింపు సోమవారం ప్రారంభం కాగా ఆ రోజంతా చెల్లని ఓట్లను విభజించి బండిల్స్ కట్టడానికే సరిపోయింది. మంగళవారం ఉదయం 11.30 గంటలకు అసలు ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కలిపి మొత్తం 2,52,100 ఓట్లు పోల్ కాగా వాటిలో 28,000 ఓట్లు చెల్లుబాటు కానీ ఓట్లుగా నిర్ధారించారు. మిగిలిన 2,24,100 ఓట్లను 21 టేబుళ్లపై ఒక్కో టేబుల్‌కు వెయ్యి చొప్పున ఒక రౌండ్‌లో 21,000 ఓట్లను లెక్కిస్తున్నారు. పూర్తయిన ఆరు రౌండ్లలో 1,26,000 ఓట్లను లెక్కించారు. మరో 98,000 ఓట్లకుపైగా లెక్కించాల్సి ఉన్నది. ఇప్పటి వరకు బీజేపీ అభ్యర్థి సి అంజిరెడ్డి 7,118 ఓట్ల ఆధిక్యంలో కొనసాగు తున్నారు. అంజిరెడ్డికి 45,822 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డికి ఆరు రౌండ్లలో 38,704ఓట్లు లభించాయి. బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు 32,110 ఓట్లు వచ్చాయి. ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్‌కు 799, స్వతంత్ర అభ్యర్థులు ముస్తాక్ అలీకి 1208, యాదగిరి శేఖర్‌రావుకు 1917 ఓట్లు వచ్చాయి. ఇంకా ఐదు రౌండ్ల ఓట్ల లెక్కింపు జరుగాల్సి ఉన్నది. తుది ఫలితం బుధవారం వెలువడే అవకాశము న్నది. బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ అభ్యర్థులు నువ్వానేనా అన్నట్లు తలపడి పోటీని ముక్కోణపు పోటీగా మార్చి అదే స్థాయిలో సాధించడంతో మొదటి ప్రాధాన్యం ఓటుతోనే ఎవరు గెలిచే అవకాశం లేదు. దీంతో ఎలిమినేషన్ పద్ధతిలో రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కించాల్సిన అవసరం ఏర్పడనున్నది.

ఆరో రౌండ్‌లో కాంగ్రెస్‌కు స్వల్ప ఆధిక్యం

ఐదు రౌండ్ల వరకు బీజేపీ ఆధిక్యం కొనసాగగా ఆరో రౌండ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి 205 ఓట్ల ఆధిక్యం లభించింది. ఈ రౌండ్‌లో ఆయనకు 7,060 ఓట్లు రాగా బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి 6,855 ఓట్లు వచ్చాయి. బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ 5,548 ఓట్లు సాధించారు.

కీలకంగా రెండో ప్రాధాన్య ఓట్లు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎంపికలో రెండో ప్రాధాన్య ఓట్లు కీలకంగా మారుతున్నాయి. పోటీ హోరాహోరీగా సాగడంతో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ ముగ్గురూ భారీగానే ఓట్లు సాధిస్తున్నారు. దీంతో తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి ఏ ఒక్కరికీ కోటా ఓట్లు సాధించే అవకాశం లేక పోవడంతో రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపుపై అభ్యర్థులు వారి అనుచరులు ఆశలు పెట్టుకు న్నారు. ఎవరికి వారు తమకు రెండో ప్రాధాన్య ఓట్లు అత్య. ధికంగా వచ్చాయని అంచనా వేసుకుంటున్నారు. త క్కువ ఓ ట్లు వచ్చిన ఒకొక్కరినీ ఎలిమినేట్ చేసుకుంటూ వచ్చే సరికి మొదటి మూడు స్థానాల్లో మార్పు వస్తుందని, దీంతో తమ అభ్యర్థే ముందు స్థానంలో నిలుస్తారని అంచ నాలు వేసుకుంటున్నారు. ముగ్గురి మధ్య గట్టి పోటీ ఉండ డంతో మూడో స్థానంలో ఉన్న అభ్యర్థి ఎలిమినేట్ అ య్యే వరకు ఎవరికీ కోటా ఓట్లు లభించే అవకాశాలు కనిపిం చడం లేదు. మూడో స్థానంలో నిలిచే అభ్యర్థికి తొలి ప్రాధా న్య ఓటు వేసిన ఓటర్లలో రెండో ప్రాధాన్య ఓటు ఎవరికి ఎక్కువ వేస్తారో వారే విజేతగా నిలిచే అవకాశం ఉంది.


ఓట్ల లెక్కింపును పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి


బ్యాలెట్ పత్రాలను లెక్కిస్తున్న సిబ్బంది


కౌంటింగ్ కేంద్రంలో అభ్యర్థులు, బీజేపీ నాయకులు

రౌండ్ల వారీగా ప్రధాన అభ్యర్థులు సాధించిన ఓట్లు

	1వ రౌండ్	2వ రౌండ్	3వ రౌండ్	4వ రౌండ్	5వ రౌండ్	6వరౌండ్
బీజేపీ	6,712	7979	8619	7807	7850	6,855
కాంగ్రెస్	6,676	6,522	5614	6,544	6288	7,060
బీఎస్పీ	5,867	4927	5,086	5,271	5411	5,548
లీడ్	36(బీజేపీ)	1457(బీజేపీ)	3,005 (బీజేపీ)	1,263(బీజేపీ)	1,562(బీజేపీ)	205(కాంగ్రెస్)

చెల్లని ఓట్లతో తిప్పలు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలైన ఓట్లలో చెల్లని ఓట్లను గుర్తించి వాటిని తొలగించిన తర్వాత చెల్లిన ఓట్లలో 50శాతం ఓట్లకు ఒక ఓటు అదనంగా కలిపి అభ్యర్థి గెలువడానికి కోటా ఓటుగా గుర్తిస్తారు. ఈ నియోజకవర్గంలో 3న ఓట్ల లెక్కింపు చేపట్టి చెల్లని ఓట్లను గుర్తించడానికి ఒక రోజంతా తీసుకున్నా దానిని అధికారికంగా ప్రకటించలేక పోయారు. చెల్లని ఓట్ల విషయంలో అభ్యంతరాలు రావడంతో మంగళవారం మళ్లీ వాటిని పరిశీలించారు. ఆ ప్రక్రియ సాయంత్రం వరకు కొనసాగింది. ఓట్ల లెక్కింపు సమయంలో కౌంటింగ్ ఏజెంట్లు కొన్ని ఓట్ల విషయంలో అభ్యంతరం వ్యక్తం చేస్తే వాటిని తిరిగి పరిశీలిస్తున్నారని సమాచారం. దీంతో ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు కోటా ఓటు ఎంతో ప్రకటించే అవకాశం లేదని తెలుస్తున్నది.

ముగ్గురు ఎమ్మెల్సీలు జిల్లావారే...

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య
- స్థానిక సంస్థల నుంచి తానిపర్తి భానుప్రసాదరావు
- ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా వెంకట్రాంరెడ్డి
- ముగ్గురు వేర్వేరు పార్టీల నుంచి ప్రాతినిధ్యం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

తెలంగాణ శాసనమండలిలో జిల్లాకు చెందిన మరొకరికి ప్రాతినిధ్యం లభించింది. ఈనెల 27వ తేదీన జరిగిన కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన మల్క కొమురయ్య మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే విజయం సాధించారు. సోమవారం కరీంనగర్‌లో జరిగిన ఓట్ల లెక్కింపులో కొమురయ్య సమీప అభ్యర్థి పీఆర్టీయూకు చెందిన వంగల మహేందర్ రెడ్డి పై 5,777 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈసారి జరిగిన ఎన్నికల్లో ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఓటు హక్కు కల్పించారు. దీంతో మల్క కొమురయ్య కూడా ఓటు హక్కు పొందారు. పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని బంధం పల్లికి చెందిన మల్క కొమురయ్య హైదరాబాదులో స్థిరపడ్డారు. ఆయన పల్లవి విద్యాసంస్థలను నడిపిస్తున్నారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్త అయిన ఆయన బీజేపీ ద్వారా రాజకీయ అరంగేట్రం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆయన మల్కాజ్ గిరి ఎంపీ టికెట్ ఆశించినప్పటికీ దక్కలేదు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయనను పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిపింది. ప్రయి వేట్ ఉపాధ్యా యులు, అధ్యాప కుల ఓటర్లను ప్రసన్నం చేసుకోవడంతో పాటు ప్రభు త్వ ఉపాధ్యాయులు, అధ్యాప కుల మద్దతును కూడగట్టుకున్న ఆయన తొలి ప్రాధాన్యత ఓట్లతోనే విజయ సాధిం చడం బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నిం పింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ నుంచి కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ కుమార్ ప్రాతినిధ్యం వహిస్తూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా కొన సాగుతున్నారు. ఎమ్మెల్సీగా మల్క కొము రయ్య గెలు పొందడంతో ఉమ్మడి జిల్లా నుంచి చట్టసభల్లో రెండో వ్యక్తిగా ప్రాతినిధ్యం పొం దారు. మల్క కొము రయ్య గెలుపుతో పెద్ద ప ల్లి జిల్లాలో బీజేపీకి మ రింత బలం చేకూర నున్నది.ఇదే జిల్లాలోని ఎలిగేడు మండలం లోకపేట గ్రామానికి చెందిన తానిపర్తి భాను ప్రసాదరావు స్థానిక సంస్థల ఎమ్మెల్సీగాకొనసా గుతున్నారు. ఆయన మూడోసారి వరుసగా గెలు పొందడం గమనార్హం. 2021 డిసెంబర్ పదో తేదీన జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి గెలు పొందారు. ఆయన 2022 ఫిబ్రవరి 21వ తేదీన ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన పదవీకాలం 2028 ఫిబ్రవరి 20వ తేదీ వరకు ఉంది. గత ఏడాది క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుని అధికారం చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో ఎమ్మెల్సీ భాను ప్రసాదరావు కాంగ్రెస్ పార్టీలో చేరా రు. ఆయన మొదట కాంగ్రెస్ పార్టీ నుంచే రాజకీయ అరంగేట్రం చేసినప్పటికీ, ఆ తర్వాత బీఆర్ఎస్ లో చేరారు. తిరిగి కాంగ్రెస్ పార్టీలో కి వచ్చారు. అలాగే జిల్లాలోని ఓదెల మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన ఐఏఎస్ అధికారి పరిపాటి వెంకట్రాంరెడ్డి సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా కొనసాగారు. పదవీకాలం పూర్తికాకముందే కలెక్టర్ పదవికి రాజీనామా చేసే 2021లో కేసీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆ వెంటనే నవంబర్‌లో జరిగిన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్ని కల్లో వెంకట్రాంరెడ్డి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఆయన డిసెంబర్ ఒకటో తేదీన ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన పదవీకాలం 2027 నవంబర్ 30వ తేదీ వరకు ఉంది. గత ఏడాది జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో వెంకట్రాంరెడ్డి మెదక్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. ఆయన ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. శాసన మండలిలో ఎమ్మెల్సీలుగా అడుగు పెట్టిన జిల్లాకు చెందిన ముగ్గురిలో ఒకరు కాంగ్రెస్, ఒకరు బీఆర్ఎస్, తాజాగా గెలిచిన మల్క కొమురయ్య బీజేపీ కి చెందిన వారు కావడం గమనార్హం. సదరు ప్రజాప్రతి నిధులకు ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి కేటాయించే నిధుల్లో ఎక్కువ శాతం జిల్లాకు కేటాయించినట్లయితే జిల్లా మరింత అభివృద్ధి చెందనున్నది.



విజయీభవ...

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- జిల్లా వ్యాప్తంగా 23పరీక్ష కేంద్రాలు


ఖని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నంబర్లు వేస్తున్న సిబ్బంది

పెద్దపల్లి కల్చరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 23సెంటర్లలో పరీక్షలు బుధవారం ఉదయం 9 నుంచి 12గంటల వరకు, నిర్వహించ నున్నట్లు నోడల్ అధికారి కల్పన పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 10,530 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. విద్యార్థులకు సెంటర్ వెతుక్కునే ఇబ్బంది లేకుండా లోకేషన్ రూట్‌మ్యాప్‌తో క్యూఆర్ కోడ్ హాల్‌టికెట్లతోపాటు పంపించారు. పరీక్ష కేంద్రానికి నియ మించిన చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌లకు శిక్షణ ఇచ్చారు. ప్రతీ కేంద్రంలో సీసీకెమరా, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ప్రశాంతంగా పరీక్షలు రాసే విధంగా ఏర్పాట్లు చేసినట్లు నోడల్ అధికారి తెలిపారు.

కోల్‌సిటీటౌన్ (ఆంధ్రజ్యోతి): రామగుండం, ఎన్‌టీపీసీ, గోదావరిఖని ప్రాంతాల్లో ఏడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. రామగుండంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎన్‌టీపీసీలో సచ్‌దేవ జూనియర్ కళాశాల, గోదావరిఖనిలో ప్రభుత్వ బాలుర కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల, కాకతీయ జూనియర్ కళాశాల, ఎఫ్‌సీఐ గౌతమినగర్(శాంతినగర్)లోని తెలంగాణ మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి

ఇంటర్ పరీక్షలు ఉదయం 9గంటల నుంచి 12 వ రకు పరీక్షలు జరుగుతాయని నోడల్ అధికారి కల్పన పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు ముందుగానే చేరుకోవాలని, 30 నిమిషాల ముందు నుంచే కేంద్రాలకు అనుమతిస్తామన్నారు. విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకొని ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. 9 గంటల 5 నిమిషాల తరువాత వచ్చిన వారిని అనుమతించమని తెలిపారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ప్రిన్సిపాల్ అమరేందర్ తెలిపారు. కేజీబీవీ మోడల్ కళాశాలలకు చెందిన ప్రథమ ద్వితీయ సంవత్సర విద్యార్థులు 260 మంది పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. విద్యార్థులంతా సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

డెలి'వర్రీ'..

- మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గైనకాలజిస్టు లేక అవస్థలు
- గర్భిణీలు, బాలింతలు, నవజాత శిశువులకు అందని వైద్యం
- గోదావరిఖని, పెద్దపల్లికి రెఫర్
- రెండు నెలలుగా ఖాళీగా ఉన్న ఆసుపత్రి

6


ఖాళీగా ఉన్న ఆసుపత్రిలోని బెడ్లు

మంథని మాతాశిశు ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ లేకపోవడంతో ప్రసవానికి గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. నియోజక వర్గంలోని మారుమూల గ్రామాల గర్భిణులు, బాలింతలు ఈ ఆసుపత్రి పై ఆధారపడే వారు. రెండు నెలలుగా గైనకాలజిస్ట్ లేకపోవడంతో ప్రసవానికి గోదావరిఖని, పెద్దపల్లికి రెఫర్ చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో ఆసుపత్రి సిబ్బందే ప్రసవాలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఎంసీహెచ్‌లో గైనకాలజిస్ట్‌ను నియమించి సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి పై ప్రణాళికాబద్ధంగా ముందుకు..

కోల్‌సిటీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రామగుండం అభివృద్ధిపై ముందు చూపుతో ప్రణాళికాబద్ధంగా ముందుకు నడుస్తున్నామని, రాబోయే 30 నుంచి 40ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. మంగళవారం ఆర్‌టీసీకాలనీ, చంద్రబాబుకాలనీ, కేసీఆర్‌కాలనీ, శారదానగర్, ఫైర్‌స్టేషన్ ఏరియాల్లో పర్యటించారు. ఆర్‌టీసీ కాలనీకి అప్రోచ్‌రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు. ఫైర్ స్టేషన్ రోడ్డు నుంచి శారదానగర్ రోడ్డు లింకు రోడ్డును అభివృద్ధి చేస్తామన్నారు. ఫైర్‌స్టేషన్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో పేదలకు పక్కా నివాసాలు నిర్మిస్తామన్నారు. లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్, మేదరిబస్తీ, ఉల్లిగడ్డల బజార్, అడ్డగుంటపల్లి అబ్దుల్ కలాం సెంటర్‌లో పర్యటించారు. రూ.29.5కోట్ల టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో చేపట్టిన యూజీడీ, సెంట్రల్‌లైటింగ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ రోడ్ల పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రామగుండం అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. ఈ ప్రాంతంలో రూ.29.5కోట్లతో 40అడుగుల విస్తీర్ణంతో సీసీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ తీసి వేసి ఇరువైపులా లైటింగ్ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అభివృద్ధి పనులకు వ్యాపారస్థులు, ప్రజలు సహకరించాలన్నారు. అభివృద్ధి ఓర్వలేక కొందరు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, వారికి అభివృద్ధితోనే సమాధానం చెబుతున్నామన్నారు. పలు ప్రభుత్వ విద్యాసంస్థలను పరిశీలించిన ఆయన పాఠశాల నుంచి పీజీ కళాశాలల వరకు సింగరేణి సహకారం ఉండేలా ఆ సంస్థపై ఒత్తిడి చేస్తామన్నారు. ఎస్ఈ శివానంద్, ఈఈరామన్, నాయకులు మహంకాళి స్వామి, రాజేష్, సాంబమూర్తి, ఉమాదేవి ఉన్నారు.


కళ్యాణ్‌నగర్ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

మైదంబండ ప్రాంతంలో పులి అడుగులు

ముత్తారం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైదంబండ శివారు ప్రాంతాల్లో పులి అడుగులు మంగళవారం ఉదయం కనిపించాయని అటవీశాఖ అధికారులు తెలిపారు. అయితే అక్కడి నుంచి ఎటువైపు వెళ్ళిందనేది గాలిస్తున్నారు. అడవి శ్రీరాంపూర్ చెరువు వద్ద ఆదివారం పెద్దపులి అడుగు జాడలను గుర్తించిన అధికారులు రెండు రోజులుగా గాలిస్తున్నారు. మంథని, ముత్తారం మానేరు సరిహద్దు ప్రాంతాలలో పెద్ద పులి సంచరిస్తోంది. అధికారులు పులి సమాచారం గోప్యంగా ఉంచుతున్నారు. కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా అగుపిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్ఐ నరేష్ తెలిపారు.

మండుతున్న ఎండలు...

- మార్చి మొదటి వారంలోనే భానుడి భగభగ


ఎండ వేడితో గొడుగుతో వస్తున్న ప్రజలు

కళ్యాణ్‌నగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది భానుడు ప్రతాపం చూపుతున్నాడు. మార్చి మొదటివారంలోనే 38డిగ్రీలకు ఉష్ణోగ్రతలు చేరుకున్నాయి. ఫిబ్రవరిలో 35 నుంచి 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకాగా మార్చి ప్రారంభంలోనే 38డిగ్రీలకు చేరుకుంది. ఉదయం 7గంటలకే భానుడు భగ్గుమంటున్నాడు. రాత్రి 7గంటలు దాటినా ఎండ వేడి తగ్గడం లేదు. మంగళవారం గరిష్ట ఉష్ణోగత 38.4, కనిష్ట ఉష్ణో గ్రత 19.6డిగ్రీలుగా నమోదైంది. మధ్యాహ్నం ప్రధాన చౌరస్తా జనాలు లేక వెలవెలబోతుంది. ప్రజలు గొడుగులు, జేబురుమాళ్లు, టోపీలు ధరించి బయటకు వస్తున్నారు.

మధ్యాహ్న సమయంలో జనా లు లేక వ్యాపార కూడలి వెలవెల బోయింది. మార్చిలోనే ఎండలు మండుతుండగా రానున్న ఏప్రిల్, మే మాసాల్లో ఎండలు ఎలా ఉంటా యోనని జనం భయపడి పోతున్నారు.

టిప్పర్ ఢీకొని ఒకరి మృతి


శంకరయ్య (ఫైల్)

ఇల్లంతకుంట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతారం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నక్క శంకరయ్య(55) మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలం బందనకల్ గ్రామానికి చెందిన శంకరయ్య ద్విచక్రవాహనంపై మంగళవారం సిద్ధిపేట జిల్లా మైలారం గ్రామానికి బంధువుల ఇంటికి వెళ్తున్నాడు. అనంతారం గ్రామ సమీపంలో టిప్పర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ ద్విచక్రవాహన నంబర్ ఆధారంగా గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక తరలిస్తున్న ఇద్దరి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి, రాజన్నపేట గ్రామాలకు చెందిన వాహన డ్రైవర్ ఆలకుంట రాజు, యజమాని శివరాత్రి నర్సింలును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. రాజన్నపేట గ్రామ శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఇసుకను తరలిస్తూ ట్రాక్టర్ కనిపించింది. అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాహనడ్రైవర్ ఆలకుంట రాజు, యజమాని శివరాత్రి నర్సింలుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ తెలిపారు.

చోరీకి యత్నించిన యువకుడి పట్టివేత

వేములవాడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో దొంగతనానికి యత్నించిన యువకుడిని స్థానికులు పట్టుకుని విద్యుత్ స్తంభానికి కట్టేసి చితకబాదారు. వేములవాడ పట్టణంలోని జాతర గ్రౌండ్ సమీపంలోని శివనగర్‌లో మంగళవారం మధ్యాహ్నం సమయంలో ఇంటి యజమానులు గేటుకు తాళం వేసి ఇంట్లో నిద్రిస్తున్న క్రమంలో ఇంట్లో ఎవరూ లేరని భావించిన ఓ వ్యక్తి గోడ దూకి చోరీకి యత్నించాడు. గమనించిన ఇంట్లోని వారు బయటికి వచ్చి చూడగా యువకుడు తప్పించుకునే ప్రయత్నం చేశాడు. కాలనీవాసుల సహాయంతో వారు అతడిని పట్టుకుని విద్యుత్ స్తంభానికి బంధించి చితకబాది పోలీసులకు అప్పగించారు.

గిరిజన తండాల్లో ఎక్సైజ్ దాడులు


బుగ్గరాజేశ్వరతండాలో సారాను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు అల్మాస్‌పూర్, బుగ్గరాజేశ్వర, కిష్టునాయక్ తండాల్లో ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్, జిల్లా టాస్క్‌ఫోర్సు ఎక్సైజ్ ఎస్‌ఐ శైలజ ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం దాడులు నిర్వహించారు. సారా తయారీ కేంద్రాలను గుర్తించారు. రవాణాకు సిద్ధంగా ఉన్న 10 లీటర్ల నాటు సారా, 10 కిలోల బెల్లం, 2 కిలోలపటికను స్వాధీన పర్చుకున్నారు. నిల్వ చేసిన 50 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. మండల కేంద్రంలోని అన్ని కిరాణ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. బెల్లం అమ్మకాలు కొనసాగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సారా తయారు చేస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఒకరిని రూ.లక్ష పూచీకత్తుపై నాయబ్ తహసీల్దార్ సత్యనారాయణ ఎదుట బైండోవర్ చేశామని వెల్లడించారు. దాడుల్లో సిబ్బంది రాకేశ్, కిష్టునాయక్, సుమన్, రాజు, మల్లేశ్, యోగివర్మ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెద్దపల్లిటౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి రైల్వేస్టేషన్ వద్ద అచేతన స్థితిలో ఉన్న వ్యక్తిని గత శనివారం 108 అంబులెన్స్ సిబ్బంది గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి వయసు 55 ఉన్నట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ గదిలో మృతదేహం భద్రపరిచామని, నీలి రంగు ఫుల్ టీషర్ట్, ఆకుపచ్చ లుంగీ ధరించి ఉన్నట్లు వివరించారు. వివరాలకు సెల్ నంబర్లు 8712656506, 8712656507 సంప్రదించాలని సూచించారు.

శునకాల దాడిలో పది మందికి గాయాలు

ఓదెల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం శునకాల దాడిలో పది మందికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన అప్పని పద్మ, లక్ష్మీ, బుద్దె కనకమ్మ, శంకర్, ప్రమీల , లక్ష్మి, మదనమ్మ తోపాటు పలువురిపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. దీంతో వారు స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స చేయించుకున్నారు.

ఎండదెబ్బతో కూలీ మృతి

వీణవంక మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వీణవంక మండల కేంద్రంలో ఎండదెబ్బ తగిలి షేక్ నాసిర్ (41) అనే కూలీ మృతి చెందాడు. మహబూబాద్ జిల్లా కురవి మండలం గుండ్రతిమడుగు చెందిన నాసిర్ కొంత కాలంగా రోడ్డు నిర్మాణ సంస్థలో కూలీగా పనిచేస్తున్నాడు. నిత్యం మద్యం సేవిస్తూ ఉండేవాడు. అదివారం రాత్రి ఎక్కువ మోతాదులో మద్యం తాగి బిల్డింగ్‌పై పడుకున్నాడు. ఉదయం అయినా లేవకుండా ఎండలో పడుకోవడంతో ఎండదెబ్బ తగిలి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిరుపతి తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

శంకరపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడికల్‌లో తాటిచెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు పడి గీత కార్మికుడు గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికల్ గ్రామానికి చెందిన మొలుగూరి రఘుపతి అనే గీత కార్మికుడు మంగళవారం గ్రామ శివారులోని తాటిచెట్టు ఎక్కి కల్లు గీసి కిందకి దిగుతుండగా మోకు జారి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బోరు మోటార్ చోరీ

ముస్తాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవునూర్ గ్రామంలో బోరు మోటార్ చోరీకి గురైందని రైతు అంకని ఎల్లం ఆవేదన వ్యక్తం చేశారు. ఆవునూర్‌లో తనకున్న పొలం వద్ద పంట ఎండిపోతుందని బోరుమోటరు తీసి మళ్లీ లోతుగా తవ్విద్దామని బయట పెట్టామన్నారు. మంగళవారం వచ్చి చూడగా దాదాపు రూ.30 విలువ చేసే బోరు మోటార్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

సుల్తానాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం చిన్నకలువలలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన రాజేశ్వరి అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తోంది. శుక్రవారం కరీంనగర్‌లో ఉన్న కూతురు ఇంటికి వెళ్లి మంగళవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చింది. తాళం తీసి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరచి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. బంగారం, నగదు దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు తెలిపింది.

● సుల్తానాబాద్‌లో లారీల బ్యాటరీలు చోరీ

సుల్తానాబాద్ శాస్త్రినగర్ వద్ద గల లారీల అడ్డా వద్ద లారీలకు సంబంధించి బ్యాటరీలను గుర్తు తెలియని దొంగలు చోరీ చేశారు. పన్నెండు బ్యాటరీలను దొంగలు తీసుకుపోయారని బాధితులు తెలిపారు.

రూ.7వేలు పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7వేలు పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 14మంది రైతులు 177క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 12క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు.

డెలివర్రీ



మంథని మాతా శిశు ఆరోగ్య కేంద్రం

- మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గైనకాలజిస్టు లేక అవస్థలు
- గర్భిణీలు, బాలింతలు, నవజాత శిశువులకు అందని వైద్యం
- గోదావరిఖని, పెద్దపల్లికి రెఫర్
- రెండు నెలలుగా ఖాళీగా ఉన్న ఆసుపత్రి

మంథని, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మంథని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవలు అందక గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. యాభై పడకల ఆసుపత్రిలో గర్భిణులు, నవజాత శిశువులు లేక పోవడంతో బోసిపోతోంది. మంథని నియోజకవర్గంలోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్, మల్హర్, కాటారం మండలాలతో పాటు ఇతర మండలాల్లోని మారుమూల గ్రామాలకు మంథని మాతాశిశు ఆరోగ్యకేంద్రం అందుబాటులో ఉంటుంది. ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మంథని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో రెండు నెలలుగా గైనకాలజిస్టు వైద్యురాలు లేని కారణంగా వైద్య సేవలు అందని ద్రాక్షగా మారింది. ఇక్కడ పని చేసిన గైనకాలజిస్టు డాక్టర్ స్రవంతి ఇటీవల బదిలీపై వెళ్లడంతో ఆసుపత్రిలో సేవలు నిలిచిపోయాయి. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన గర్భిణీలు, బాలింతులు, నవజాత శిశువులకు ఆరోగ్య పరీక్షలు, చికిత్సలు, మందులు అందడం లేదు. గోదావరిఖని, పెద్దపల్లి మాతా శిశు ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా వారికి శారీరక, మానసిక అవస్థలతో పాటు సమయాభావం, ప్రయాణంలో అలసటతో ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు వారి కుటుంబ సభ్యులు సైతం వారిని సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లడానికి అంగీకరించడం లేదు. ఈ ఆసుపత్రిలో గైనిక్ సేవలు అందుబాటులో ఉన్న సమయంలో నెలకు 50కి పైగా ప్రసవాలు జరిగినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

ప్రస్తుతం గర్భిణీలకు మందులు పంపిణీ చేస్తున్నారు. అత్యవసరంగా ప్రసూతికి వచ్చే గర్భిణి కుటుంబ సభ్యులకు ఇక్కడి పరిస్థితిని వివరిస్తున్నారు. వారి అనుమతితో మిడ్ వైఫరీలు, స్టాఫ్ నర్సులు డెలివరీ చేస్తున్నారు. పది రోజుల్లో రెండు డెలివరీలు చేశారు. అత్యవసరంగా తల్లీబిడ్డల ప్రాణాలను కాపాడానికి ఇలా సేవలందిస్తున్నారు.

ఇలాంటి సమయంలో వారిని గోదావరిఖని, పెద్దపల్లి ప్రాంతాలకు తరలించడానికి అవకాశం ఉండటం లేదు. అందుకే వారు సాహసోపేతంగా డెలివరీలు చేస్తున్నారు. అలా తరలించే సమయాల్లో ఎవరి కైనా ఇబ్బందులు ఏర్పడితే తల్లీ, శిశువులకు ప్రాణాపాయం చోటుచేసుకునే ప్రమాదం ఉంది. నియోజకవర్గ కేంద్రంలోని మాతా శిశు ఆసుపత్రిలో గైనకాలజిస్టును నియమించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని మంథని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గైనకాలజిస్టు సేవలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ఖాళీగా ఉన్న ఆసుపత్రిలోని బెడ్లు

వారంలోగా రోస్టర్ పద్ధతిలో నియమిస్తాం
డాక్టర్ కే. శ్రీధర్, డీసీహెచ్‌ఎస్, పెద్దపల్లి.

మంథని ఎంసీహెచ్‌లో గైనకాలజిస్టును నియమించడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. ఎంసీహెచ్‌లో రెగ్యూలర్ గైనకాలజిస్టును నియమించడానికి ఇప్పటికే 4సార్లు ప్రకటన ఇచ్చినా స్పందన రాలేదు. జిల్లాలో ఐదుగురు గైనకాలజిస్టులు పని చేస్తుండగా వారిలో ఇద్దరు లీవ్‌లో ఉన్నారు. వారు విధుల్లోకి రాగానే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి వారి ఆదేశాల మేరకు రోస్టర్ పద్ధతిలో ఎంసీహెచ్‌లో విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకొంటాం. ఓపీ, సర్జరీలు చేసే విధంగా చర్యలు తీసుకోవటానికి కృషి చేస్తున్నాం.

మల్కపేట రిజర్వాయర్‌లోకి నీటి విడుదల

● హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు


మల్కపేట రిజర్వాయర్‌లోకి చేరుతున్న నీరు

కోనరావుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మల్కపేట రిజర్వాయర్‌లోకి నీటిని మంగళవారం అధికారులు విడుదల చేశారు. వేసవిలో పంటలు ఎండిపోతాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాలతో అధికారులు నీటి విడుదలను ప్రారంభించారు. మిడ్‌మానేరు నుంచి మల్కపేట రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బోయినపల్లి మండలంలోని మిడ్ మానేరు నుంచి సొరంగం ద్వారా భారీ మోటారు పంపులతో కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్‌లోకి నీటిని పంపింగ్ చేసే ప్రక్రియ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రారంభించారు. దీని ద్వారా ఎల్లారెడ్డిపేట మండలంలోని సింగసముద్రం, మైసమ్మ చెరువులకు నీరు అందుతుంది. సాగు నీరు అందించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి రైతులు తీసుకెళ్లడంతో ఆయన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధికారులతో మాట్లాడి 0.5 టీఎంసీల నీటిని విడుదల చేసే ప్రక్రియను ప్రారంభించారు. మల్కపేట రిజర్వాయర్ మొత్తం సామర్థ్యం మూడు టీఎంసీలు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 0.75 టీఎంసీల నీరు మల్కపేట రిజర్వాయర్‌లో ఉంది. మరో 0.5 టీఎంసీల నీటిని నింపే ప్రక్రియ ప్రారంభించారు. నీటి విడుదలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి

జగిత్యాల క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని బైపాస్ రహదారిపై సాయిబాబా గుడి సమీపంలో ట్రాక్టర్ బోల్తా పడి మల్లెపూల హన్మంతు(27) అనే యువకుడు మంగళవారం మృతిచెందాడు. హన్మంతు ట్రాక్టర్‌పై కూలి పనికి వెళ్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం హన్మంతు ట్రాక్టర్‌పై పనికి వెళ్లగా డ్రైవర్ యాదగిరి అజాగ్రత్తగా వాహనాన్ని నడపడంతో సాయిబాబా గుడి సమీపంలో బోల్తా పడింది. దీంతో హన్మంతుపై ట్రాలీ పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడికే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ యాదగిరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

జగిత్యాల క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక జిల్లా కేంద్రంలోని లింగంపేటలో మంగళవారం ఆవునూరి నర్సయ్య(50) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. నర్సయ్యకు భార్య యమునతో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మూడేళ్ల క్రితం పెద్ద కూతురికి వివాహం చేశాడు. కొద్ది రోజులకే నర్సయ్య భార్యకు రోడ్డు ప్రమాదం జరుగడంతో చికిత్స కోసం రూ.15 లక్షలకు పైగా అప్పు చేశాడు. అప్పుల బాధ భరించలేక తీవ్ర మనస్తాపానికి గురైన నర్సయ్య తన ఇంటి సమీపంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నర్సయ్య భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంపై విరక్తి చెంది..

జగిత్యాల క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) :జీవితంపై విరక్తి చెంది జిల్లా కేంద్రంలోని బేడబుడగ జంగాల కాలనీలో తోట అనిత(50) అనే మహిళ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకుంది. అనిత కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. కొన్ని రోజులుగా అనిత మద్యానికి బానిసై ఇంటి వద్దనే ఉంటోంది. జీవితంపై విరక్తి చెందిన అనిత మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంతో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. కూతురు దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

లక్ష్మీపూర్‌లో యువకుడు..


పవన్‌కళ్యాణ్ (ఫైల్)

మానకొండూర్, మార్చి4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కొమ్మగల్ల పవన్‌కళ్యాణ్ (22) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కొమ్మగల్ల లక్ష్మి-నాంపెల్లి దంపతులకు కుమారుడు పవన్‌కళ్యాణ్, ఒక కూతురు ఉంది. నాంపెల్లి వ్యవసాయం చేసుకుంటూ గొర్రెల కాపరిగా పని చేస్తున్నాడు. కుమార్తెకు రెండేళ్ల క్రితం వివాహం కాగా పవన్‌కళ్యాణ్ డిగ్రీ వరకు చదువుకొని కుటుంబానికి తోడుగా ఉంటున్నాడు. రెండు రోజులుగా పవన్ అనారోగ్యం పాలు కావడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం అర్ధరాత్రి ఇంటిలోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుని తండ్రి నాంపెల్లి ఫిర్యాదు మేరకు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

ఆలయంలో చోరీ

జగిత్యాల క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌లో ఉన్న నల్ల పోచమ్మ తల్లి ఆలయంలో మంగళవారం చోరీ జరిగింది. దొంగలు ఆలయంలోకి చొరబడి అమ్మ వారి హుండీతో పాటు బీరువాను పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. రూ.70 వేల విలువగల విద్యుత్ సామగ్రిని సైతం దొంగలు అపహరించుకు వెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చోరీకి యత్నం

జగిత్యాల క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చోరీ యత్నం జరిగింది. మంగళవారం ఉదయం సిబ్బంది కార్యాలయం తెరువడానికి రాగా తలుపునకు ఉన్న తాళం తెరిచి ఉండడాన్ని గమనించి సబ్ రిజిస్ట్రార్‌కు తెలియజేశారు. దుండగులు కార్యాలయంలో విలువైన పత్రాలు అపహరించేందుకు యత్నించినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు. సబ్ రిజిస్ట్రార్ సుజాత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని కొత్తపల్లి పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ట్రైనీ ఐపీఎస్ వసుంధర యాదవ్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లా తండా పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోర్ గ్రామానికి చెందిన ప్రదీప్ (30) మరో ఎనిమిది మంది ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నారు. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుంటూరుపల్లి, కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కాపూర్, చింతకుంట ప్రాంతాల్లో నాలుగు చోరీలకు పాల్పడ్డారు. ఆధారాలు సేకరించిన పోలీసులు మధ్యప్రదేశ్‌కు వెళ్లి ఈ నెల 2న ముఠాలోని ప్రధాన నిందితుడు ప్రదీప్‌ను అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి, కానిస్టేబుళ్లు, షరీఫ్, శ్రీనాథ్, ఖదీర్‌ను అధికారులు అభినందించారు.

అడవిలో మంటలు


మంటలను ఆర్పుతున్న బీట్ అధికారి కిరణ్

వీర్నపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం సమీపంలోని అటవీ ప్రాంతంలో మంగళవారం మంటలు చెలరేగాయి. గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా అటవీశాఖ సెక్షన్ అధికారులు భూలక్ష్మి, పద్మలతలు అక్కడికి చేరుకొని ఫైర్ బ్లోయర్స్‌తో మంటలను ఆర్పివేయించారు. వెంట బీట్ అధికారి కిరణ్, బేస్ క్యాంప్ సిబ్బంది ఉన్నారు.

భర్త మద్యానికి బానిసయ్యాడని ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ మృతి

పెద్దపల్లి రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కమాన్‌పూర్ మండలం రొంపికుంట గ్రామానికి చెందిన చొప్పరి అఖిల (23)కు మండలంలోని రాంపల్లి గ్రామానికి చెందిన కనపర్తి సాగర్‌రావుతో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. ఏడాదిగా సాగర్‌రావు మద్యానికి బానిసయ్యాడు. ఈ విషయమై భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. పెద్దల సమక్షంలో పలుసార్లు నచ్చజెప్పారు. సాగర్‌రావు తీరు మారకపోవడంతో భార్య అఖిల గత నెల 27న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. గమనించిన స్థానికులు పెద్దపల్లి ఆసుపత్రికి అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్, అక్కడి నుంచి హైదరబాద్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతురాలి తండ్రి చొప్పరి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్‌ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కొడిమ్యాల, మార్చి4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరాపూర్ శివారులో మంగ ళవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని ఎస్సై ఎస్.సందీప్ పట్టుకున్నారు. గౌరా పూర్ గ్రామ శివారులో కొంత మంది పేకా ట ఆడుతున్నారని అందిన సమాచారంతో స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతు న్న ఎనిమిది మందిలో ఐదుగురిని అరెస్టు చేయగా ముగ్గురు తప్పించుకున్నారని ఎస్సై తెలిపారు. 16,950 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడినవారితో సామాజిక సేవ

కోల్‌సిటీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 15మందికి గోదావరిఖని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి నల్లాల వెంకట సచిన్‌రెడ్డి సామాజిక శిక్ష విధించారు. ఎన్‌టీపీసీ, గోదావరిఖని టుటౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇటీవల జరిగిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 15మంది పట్టుబడ్డారు. వీరిని మంగళవారం గోదావరిఖని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి అడ్డగుంటపల్లిలోని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. జడ్జి ఆదేశాల మేరకు విద్యార్థులకు మంగళవారం పండ్లు పంపిణీ చేశారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు

కోనరావుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ధర్నా పేరుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కోనరావుపేట మండలం బావుసాయిపేట అనుబంధ గ్రామమైన రామన్నపల్లికి చెందిన బత్తుల మల్లయ్య అనేవ్యక్తి బైక్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు రోడ్డుపై పడి తలకి దెబ్బ తగిలి జనవరి 19న మృతిచెందాడు. అతడి భార్య బత్తుల రేణవ్వ ఫిబ్రవరి 20న వేములవాడ రూరల్ మండలం నాంపల్లి గ్రామంలో ఉరివేసుకుని చనిపోగా వారిద్దరి చావులకి అదే గ్రామానికి చెందిన బత్తుల అంజయ్య అనే వ్యక్తి కారణమంటూ బావుసాయిపేట గ్రామానికి చెందిన బత్తుల ఎల్లయ్య, బత్తుల అంజయ్య, బత్తుల కొమురయ్య, బత్తుల రాజయ్య, బత్తుల చిన్న భీమయ్య, బత్తుల భీమయ్య, వీరితో పాటుగా మరి కొంతమంది బత్తుల రేణవ్వ మృతదేహాన్ని నాంపల్లి గ్రామం నుంచి రామన్నపల్లి గ్రామానికి తీసుకెళ్లి బత్తుల అంజయ్య, అతని సోదరులైన బత్తుల ఆగయ్య, బత్తుల రాములు, బత్తుల లచ్చయ్య అనే వారి ఇళ్ల ఎదుట ఉంచి వారి ఇండ్లపై దాడికి పాల్పడి ఇళ్లలోని వస్తువులని ధ్వంసం చేశారని తెలిపారు. కోనరావుపేట పోలీసులు వెళ్లి వారిని సముదాయించినా వినకపోవడంతో పాటు విధులకు ఆటంకం కలిగించడంతో వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ముస్తాబాద్‌లో 12 మందిపై...

ముస్తాబాద్: పోలీసు విధులకు ఆటంకం కలిగించిన 12 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు. ముస్తాబాద్ మండల కేంద్రం లో ఇటీవల ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మరణించగా స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే క్రమంలో పోలీసులను అడ్డుకొని విధులకు ఆటంకం కలిగించారు. ఈ ఘటనలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన 12 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. మృతదేహాన్ని అడ్డుపెట్టుకొని నష్టపరిహారం కోసం రోడ్లపై ధర్నాలు, రాస్తారోకోలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై తెలిపారు.

బ్యాలెట్ ద్వారా పట్టభద్రుల ఓటర్ల నిరసనలు

సమస్యల పరిష్కారం కోసం లేఖలు

కరీంనగర్ క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ నియోజకవర్గంలోని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు రకరకాలుగా తమ నిరసనను, సమస్యలను బ్యాలెట్ ద్వారా వెల్లడించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ రెండో రోజు మంగళవారం ప్రారంభంకాగా ఓటర్లు తమ ప్రాంత సమస్యలను లేఖల ద్వారా విన్నవిస్తూ పరిష్కరించాలని కోరారు. కొందరు ఓటర్లు బ్యాలెట్‌పై ఒకటి సంఖ్యకు బదులుగా రక రకాలుగా మార్క్ చేయడంతో చెల్లని ఓట్లుగా నిర్ధారించారు. ఒక ఓటరు బ్యాలెట్‌తోపాటు కలెక్టర్‌కు లేఖను రాశాడు. తమ వ్యవసాయ పొలాలకు దారి లేదని, తాము 11 మంది రైతుల మున్నామని, దారి సమస్యలను పరిష్కారించండి లేదా ఒక హెలి క్యాప్టర్‌ను ఇవ్వండి అంటూ లేఖలో పేర్కొన్నాడు. మరో ఓటరు అభ్యర్థులంతా మోసగాళ్లే అని బ్యాలెట్‌పై పెన్‌తో రాశాడు. మరి కొందరు ఓటర్లు రైతుబంధు ఇవ్వలేదని నిరసనను వ్యక్త పరిచారు. చాలా మంది ఓటర్లు వారి ప్రాంత సమస్యతో పాటు వ్యక్తిగత సమస్యలను ప్రస్తావించారు. ఇటువంటి బ్యాలెట్‌లు అన్ని ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో తిరస్కరణకు గురయ్యాయి. తిరస్కరణకు గురైన బ్యాలెట్లను అభ్యర్థుల విన్నపం మేరకు అధికారులు మంగళవారం మరొకసారి పరిశీలించి 100 ఓట్ల వరకు చెల్లుబాటు చేశారు. చెల్లుబాటు అయిన ఓట్లలెక్కింపు సందర్భంగా మరి కొన్ని ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిదానం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా తరలి వచ్చి న భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అభిషేక పూజలు చేశారు. సుమారు పదిహేను వేల మందికి పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఈవో శ్రీకాంత్‌రావు, ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్, అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం, పార్కింగ్ ప్రదేశం నిండిపోయాయి.

గోదావరి నది వద్ద షవర్స్ ఏర్పాటు




ధర్మపురి గోదావరి నది వద్ద ఏర్పాటు చేసిన షవర్స్

ధర్మపురి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని గోదావరి నది వద్ద భక్తులు స్నానాలు చేసేందుకు మంగళవారం షవర్స్ ఏర్పాటు చేశారు. క్షేత్రంలో ఈనెల 10 నుంచి లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల కోసం వేలాది మంది భక్తులు నదీ స్నానాల అనంతరం దైవ దర్శనం చేసుకుంటారు. దీంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భక్తులు స్నానాలు చేసేందుకు షవర్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వెంటనే ధర్మపురి ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ కందుకూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నది స్నానఘట్టం వద్ద షవర్స్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా భక్తుల స్నానాలు చేసేందుకు ఎంతో సౌకర్యం కల్పించినట్లు అయ్యింది.

యమధర్మరాజు ఆలయంలో అభిషేకం

ధర్మపురి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ శ్రీ యమ ధర్మరాజు ఆలయంలో మంగళ వారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు బొజ్జ సంతోష్ కుమార్, బొజ్జ సంపత్‌కుమార్ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నేరెళ్ల వంశీకృష్ణ, ఒద్దిపర్తి కళ్యాణ్ స్వామి వారికి రుద్రాభిషేకం, అయుష్య సూక్తం, యమసూక్త పూర్వక అభిషేకం, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు నేరెళ్ల వంశీకృష్ణ, ఒద్దిపర్తి కళ్యాణ్‌కుమార్ అభిషేక్ పౌరోహితులు బొజ్జ రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

దోస తోట.. లాభాల మూట



సాగు చేసిన దోస

- సేంద్రియ ఎరువులతో కూరగాయల సాగు
- ప్రత్యామ్నాయ పంటసాగుతో రైతు దేవయ్య



దోసకాయలను కవర్లలో నింపుతున్న రేణుక

ఎల్లారెడ్డిపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులు చదివినా ఆయనకు వ్యవసాయంపై మక్కువ తగ్గలేదు. వరి పంటలో దిగుబడి తగ్గినా సాగును మానుకోలేదు. నష్టాల్లో నుంచి గట్టెక్కేందుకు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు దృష్టి సారించారు. తన భూమిలోని 30 గుంటల్లో కూరగాయలను సాగు చేశారు. మరో 16 గుంటల విస్తీర్ణంలోని షెడ్డును లీజ్‌కు తీసుకుని దోస పంటను సాగు చేశారు. సేంద్రియ ఎరువుతో కూరగాయలు, దోస కాయలు పండిస్తూ లాభాలు సాధిస్తున్నారు ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన మూడపల్లి దేవయ్య.

16 గుంటల్లో దోస.. 30 గుంటల్లో కూరగాయల సాగు

మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన మూడపల్లి మల్లయ్య 1996లో ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ పూర్తి చేశాడు. తనకున్న ఐదెకరాల్లో వరి పంట సాగు చేశాడు. దిగుబడి అంతగా రాకపోవడంతో ఆయనకు కూరగాయలు సాగు చేయాలనే ఆలోచన తట్టింది. మొదట తనకున్న ఐదెకరాల్లో 30 గుంటల్లో ఐదు గుంటల చొప్పున టమాట, మిర్చి, గోరుచిక్కుడు, అలసంద, వంకాయ, బెండ సాగుకు శ్రీకారం చుట్టాడు. రూ.50వేల పెట్టుబడితో కూరగాయల పంటలను సాగు చేశాడు. లాభసాటిగా ఉండడంతో మొదట ఆయనతో పాటు భార్య రేణుక కూరగాయలను సాగు చేస్తూ స్థానికంగా విక్రయించేవారు. అన్ని ఖర్చులు పోను నెలకు రూ.70వేలు సంపాదిస్తున్నారు. వేసవికాలంలో దోస సాగుకు డిమాండ్ ఉంటుందని భావించిన రైతు మల్లయ్య గ్రామ శివారులో ఉన్న 16 గుంటల విస్తీర్ణంలోని షెడ్డును లీజ్‌కు తీసుకున్నాడు.

బీటెక్ పూర్తి చేసిన కొడుకు వేణు, బీఎస్సీ, బీఈడీ చదివిన కోడలు మౌనికలు కూడా హైదరాబాద్‌లో తాము చేస్తున్న ప్రైవేటు ఉద్యోగాలను వదిలి మల్లయ్యకు చేదోడువాదోడుగా వ్యవసాయంలో పాలు పంచుకున్నారు. దోస సాగులో విత్తనాలకు రూ.20 వేలు, మల్చింగ్ పేపర్‌కు రూ.20 వేలు, ఎరువులు, మందులకు రూ.20 వేలు వెచ్చించి బిందు సేద్యం ద్వారా దోసను సాగు చేశారు. ప్రస్తుతం పంట చేతికొచ్చింది. వాణిజ్య పంటల వైపు వెళ్లకుండా పూర్తిగా ఆహార పంటలపై దృష్టి సారించారు. పంటలను వెంకటాపూర్‌తోపాటు సిరిసిల్ల, హైదరాబాద్‌లో విక్రయిస్తున్నారు. నీటి వసతి ఉండడంతో అన్ని కాలాల పాటు కూరగాయలను పండిస్తున్నారు.

స్వయంగా సేంద్రియ ఎరువు తయారు..

రసాయనిక ఎరువులు వాడడం వల్ల అధిక ఖర్చుతో పాటు ఆరోగ్యానికి హానికరమని గమనించాచిన మల్లయ్య స్వయంగా సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నారు. వేస్ట్ కంపోజర్ ద్వారా రెండు డ్రమ్ముల్లో ఒక్కో డ్రమ్ములో 200 లీటర్ల నీటిని తీసుకుని అందులో కిలో బెల్లం వేసి ఐదు రోజుల పాటు నిల్వ ఉంచుతాడు. అనంతరం కూరగాయల మొక్కలకు పిచికారీ, నీటిని అందించడం వల్ల ఏపుగా పెరిగి దిగుబడి అధికంగా వస్తుందని మల్లయ్య తెలిపాడు.

అధిక లాభాలు

మల్లయ్య కూరగాయలతో పాటు దోసకాయల సాగుకు మొత్తం రూ.1.30 లక్షలు (దున్నడం, విత్తనాలు, మలిచ్ంగ్ పేపర్, ఎరువులు, మందులకు) వెచ్చించాడు. 50 నుంచి 120 రోజుల్లో అటు దోస, ఇటు కూరగాయాల పంట చేతికొస్తోంది. రెండు రోజులకొకసారి దోసకాయలను సేకరించి హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి మార్కెటుకు తరలిస్తున్నాడు. 3 క్వింటాళ్ల దిగుబడి వస్తుండగా, కిలోకు రూ.50 చొప్పున విక్రయిస్తున్నాడు. రెండు రోజులకు రూ.15 వేల ఆదాయం సమకూరుతోంది. పంట పూర్తయ్యే కాలం వరకు అన్ని ఖర్చులు పోను రూ.3లక్షలు మిగులుతాయని మల్లయ్య పేర్కొంటున్నాడు. మరో వైపు టమాట, మిర్చి, గోరు చిక్కులు, వంకాయ, అలసంద, బెండను స్థానికంగా విక్రయిస్తుండడంతో పాటు సిరిసిల్లకు తరలిస్తున్నాడు. అన్ని ఖర్చులు పోను నెలకు కూరగాయల ద్వారా రూ.70 వేలు సంపాదిస్తున్నాడు.



ప్రైవేటు ఉద్యోగం కంటే ఆదాయం అధికం.. :మూడపల్లి వేణు

బీటెక్ పూర్తి చేసిన నేను, బీఎస్సీ, బీఎడ్ పూర్తి చేసిన నా భార్య మౌనిక హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగాలు చేసేవాళ్లం. ఇద్దరికి కలిపి రూ.48వేల జీతం వచ్చేది. నాన్న కూరగాయలు, దోస సాగు చేయడంతో నేను, నా భార్య ఉద్యోగాలు మానేసి ఇంటికి వచ్చేశాం. అమ్మానాన్నలతో కలిసి వ్యవసాయంలో పాలు పంచుకుంటున్నాం. ప్రైవేటు ఉద్యోగం కంటే ఆదాయం బాగా వస్తోంది.



కూరగాయలు, దోస సాగు లాభదాయకం
మూడపల్లి మల్లయ్య, రైతు వెంకటాపూర్

నాకున్న ఐదెకరాల్లో గతంలో వరి పంట వేసేవాడిని. పంట పెట్టుబడి వచ్చేది కాదు. నేను చదువుకునే రోజుల్లో రంగారెడ్డి జిల్లాకు చెందిన స్నేహితుడి వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్లేవాడిని. వారు కూరగాయలు పండించేవారు. నేను కూడా వారిలాగే కూరగాయలు పండించాలని అనుకున్నాను. 30 గుంటల్లో టమాట, మిర్చి, గోరు చిక్కుడు, అలసంద, బెండ పంటలతో పాటు మరో 16 గుంటల విస్తీర్ణంలోని షెడ్డును లీజ్‌కు తీసుకుని దోస తోటను సాగుచేశా. అన్ని ఖర్చులు పోనూ నెలకు రూ.1.50 లక్షలు సంపాదిస్తున్నాం. కూరగాయలు, దోసకాయల సాగు లాభదాయకంగా ఉంటుంది.



సాగు చేస్తున్న అలసంద పంట



రవాణాకు సిద్ధంగా ఉన్న దోసకాయలు

కరీంనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయం తనిఖీ

కరీంనగర్ క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ కరీంనగర్ కార్యాలయాన్ని మంగళవారం ఆశాఖ ఐజీ బుద్ధ ప్రకాశ్ తనిఖీ చేశారు. కలెక్టరేట్‌లోని రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో ఉన్న డీఐజీ కార్యాలయం, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో పలు విభాగాలను పరిశీలించారు. ఆయా విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందితో మాట్లాడి పలు వివరాలను సేకరించారు. డీఐజీ రవీందర్, జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్‌కుమార్, సబ్‌రిజిస్ట్రార్‌లు ఉన్నారు.

తాగు నీటికి కటకట

ఇప్పపల్లిలో ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు



ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న గ్రామస్థులు

కథలాపూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం ఇప్పపల్లి వాసులు తాగునీటి ఎద్దడితో సతమతమవుతున్నారు. ఇప్పపల్లిలోని ఓ వార్డులో ఉన్న బోరుతో 30 కుటుంబాలు తాగు నీటి అవసరాలు తీర్చుకుంటుండగా మంగళవారం బోరు ఎండి పోవడంతో ఇబ్బందులు పడ్డారు. గ్రామంలో సుమారు 1400 మంది జనాభా ఉండగా 13 వాడకట్టు బోర్లు ఉన్నాయి. బోర్లలో రోజురోజుకూ నీరు అడుగంటుతోంది.

మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం ట్యాంకు నిర్మించినా నిరుపయోగంగానే ఉంటోంది. తరచూ లీకేజీలు, గేట్ వాల్వ్‌లు లేక పోవడం, పాత పైపులైను ఉండడంతో గ్రామస్థులకు నీరు అందడం లేదు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్థులు వాపోతున్నారు. వార్డుల్లో ఉన్న బోర్లు అడుగంటి పోతున్న క్రమంలో ప్రత్యామ్నాయ మార్గాలు చూపడం లో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ట్యాంకర్ ఏర్పాటు చేసినప్పటికీ ఏ మూలకు సరిపోవడం లేదని గ్రామ స్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నీటి సమస్య తీర్చాలి
: బొడ్డు లక్ష్మి, ఇప్పపల్లి గ్రామస్థురాలు

ప్రస్తుతం ఉన్న బోర్లు అడుగంటిపోతున్నందు వల్ల తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎవరి వాడలో వాళ్లకే నీళ్ళు సరి పోవడం లేదు. ఎక్కడికి వెళ్ళి నీళ్ళు తెచ్చుకోవాలో తెలియడం లేదు. అధికారులు ప్రత్యేక చొరవ చూపి కొత్తగా బోర్లు వేసి నీటి సమస్య తీర్చాలి.



భగీరథ నీటి కోసం పైపులు వేయాలి
దొనకంటి రాజు, ఇప్పపల్లి మాజీ సర్పంచ్

గ్రామంలో బోర్లు అడుగంటి పోతున్నందున పాత పైపులైను తొలగించి కొత్తవి వేయాలి. లీకేజీలను సరిచేసి గేట్ వాల్వ్‌లను ఏర్పాటు చేస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తే తాగు నీటి కష్టాలు తీరుతాయి.

నేర పరిశోధనలో కీలకం.. జాగిలం

విధుల్లో నాలుగు రకాల జాతులు



రాంబో

సిరిసిల్ల క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనలో 'జాగిలం' పాత్ర కీలకమైనది. ఏదైనా సంఘటన జరిగితే జాగిలాలను రంగంలోకి దింపి పోలీసులు దర్యాప్తును ప్రారంభిస్తారు. కేసు పురోగతి సాధించడానికి పోలీసులకు జాగిలాలు తోడ్పడుతాయి. హత్యలు, అత్యాచారాలు, చోరీలు తదితర సంఘటనల్లో ఘటనా స్థలంలో ఆధారాలను సేకరించడమే కాకుండా నేరస్థులను గుర్తించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

నాలుగు రకాల జాగిలాలు..

జిల్లాలో పోలీసు శాఖలో నాలుగు రకాల జాగిలాల జాతులు ఉన్నాయి. ఇందులో విరాట్, షాడో రకం జాగిలాలు (ఎక్స్‌ప్లోజివ్ డిటెక్షన్, వీఐపీ భద్రత), రాంబో(దొంగతనాలు, మర్డర్ ట్రాకర్), రాకీ(నార్కోటిక్ డ్రగ్స్ డిటెక్షన్) జాగిలాలు నైపుణ్యం సాధించాయి. విరాట్, రాకీ జాగిలాలు ల్యాబ్రడర్ జాతికి చెందినవి. రాంబో జర్మన్ షెపర్డ్. షాడో జాగిలం బెల్జియం మెలొనైస్ జాతీ రకంది. ఈ నాలుగు రకాల జాగిలాలు, నలుగురు కానిస్టేబుళ్లతో కలిపి డాగ్ స్క్వాడ్ బృందాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాలో ఎక్కడ, ఎలాంటి సంఘటన జరిగినా పోలీసు బలగాలు జాగిలాలతో గాలింపు నిర్వహించి నేరాన్ని పసిగడుతారు. అలాగే ఉత్సవాలు, జాతరలు, వీఐపీ బందోబస్తు, నార్కోటిక్, రోడ్డు కల్వర్టు, కాన్వాయ్ చెకింగ్ తదితర తనిఖీలను డాగ్ స్క్వాడ్ నిర్వహిస్తుంది.

నేరస్థులను పసిగట్టడంలో దిట్ట..

నేరస్థులను పసిగట్టడంలో జాగిలాలు కీలకంగా మారాయి. ప్రధానంగా షాడో అనే జాగిలం అత్యంత చురుకైనది. ఈ జాగిలం పేలుడు పదార్థాలను కనిపెట్టడమే కాకుండా వీఐపీ భద్రతలో చురుకైన పాత్ర పోషిస్తుంది. విరాట్ అనే జాగిలం నార్కోటిక్ మత్తు పదార్థాలు కనిపెట్టడంలో శిక్షణ పొందింది. ఈ జాగిలం పేలుడు పదార్థాలు ఎక్కడ ఉన్నా వెంటనే పట్టేస్తుంది. రాంబో అనే జాగిలం దొంగతనాలు, హత్యలు తదితర కేసులను ఛేదిస్తుంది. నేరస్థుడిని పసిగట్టడంలోనే కాకుండా సాక్ష్యాధారాల సేకరణలోనూ కీలక పాత్ర పోషిస్తుంది. దొంగత నాలు జరిగిన ప్రదేశాల్లో నేరస్థుడి వాసన పసిగట్టి అతడు వెళ్లిన మార్గాన్ని గుర్తిస్తాయి. రాకీ అనే జాగిలం నార్కోటిక్ మత్తు పదార్థాలను కనిపెట్టడంలో శిక్షణ పొందింది. మరో వైపు వీఐపీల భద్రతలో కల్వర్టుల వద్ద ఏదైనా పేలుడు పదార్థాలు ఉంటే వెంటనే గుర్తిస్తుంది.



విరాట్



జాగిలాలు నేరస్థులను సులభంగా గుర్తిస్తాయి.. అఖిల్ మహాజన్, ఎస్పీ రాజన్న సిరిసిల్ల

జాగిలాలు నేరస్థులను సులభంగా గుర్తిస్తాయి. జిల్లాలో జరిగే నేర సంఘటనలను ఛేదించడంలో జాగిలాలు కీలకంగా నిలుస్తున్నాయి. జాగిలాలు నేరస్థులను పసిగట్టడంలో ఎంతో ఉపయోగపడుతాయి. మనుషులతో పోల్చుకుంటే వాసన పసిగట్టడంలో 40 రెట్లు, వినికిడిలో 20 రెట్లు, కంటిచూపులో 10 రెట్లు శునకాలు ఎక్కువ శక్తి కలిగి ఉంటాయి. ప్రతిష్ఠాత్మకమైన కేసులను ఛేదించడంలో జాగిలాల పాత్ర ఎంతో ఉంది.

ఒకే చితిపై దంపతుల అంతిమ సంస్కారం



నర్సారెడ్డి, అనసూయ దంపతులు (ఫైల్)

కోరుట్ల రూరల్/మెట్‌పల్లి రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖిన్‌పూర్ గ్రామానికి చెందిన నర్సారెడ్డి, అనసూయ దంపతులకు మంగళవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని వేంపేట గ్రామ శివారులో ఈనెల 2న జరిగిన రోడ్డు ప్రమాదంలో నర్సారెడ్డి (68) మృతిచెందగా తీవ్ర గాయాలపాలైన అనసూయ(62)ను చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించారు. భర్త అంత్యక్రియలు పూర్తి కాక ముందే చికిత్స పొందుతూ భార్య అనసూయ మంగళవారం మృతి చెందింది. మృతులకు ముగ్గురు కూతుళ్లు ఉండగా అందులో చిన్న కూతురు ఆస్ట్రేలియాలో ఉంటోంది.

తండ్రి మరణ వార్త విని స్వదేశానికి వస్తుండడంతో ఆమె వచ్చే వరకు అంత్యక్రియలను కుటుంబ సభ్యులు నిలిపివేశారు. చిన్న కూతురు సోమవారం రాత్రి ఇంటికి చేరుకోగానే మంగళవారం తెల్లవారుజామున నిజామాబాద్‌లో చికిత్స పొందుతున్న తల్లి అనసూయ మృతి చెందినట్లు సమాచారం అందింది. దీంతో ఆ కుటుంబంలో మరింత విషాదఛాయలు అలుముకున్నాయి. దంపతుల మృతదేహాలను ఒకే చితిపై ఉంచి కూతుళ్ల అంత్యక్రియలను నిర్వహించారు. ఒకేసారి తల్లిదండ్రులను కోల్పోడంతో ముగ్గురు కూతుళ్ల కన్నీరు మున్నీరుగా విలపించారు.

బద్దిపోచమ్మకు భక్తుల బోనం మొక్కులు



గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించిన భక్తులు

వేములవాడ కల్చరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న దేవాలయ అనుబంధ ఆలయమైన శ్రీబద్దిపోచమ్మ అమ్మ వారికి భక్తులు బోనాల మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన మంగళవారం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఉదయం అమ్మవారికి మట్టికుండల్లో నైవేద్యాన్ని తయారుచేసిన భక్తులు డప్పుచప్పుళ్ల మధ్య శివ సత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. గంటల తరబడి భక్తులు క్యూలైన్‌లో నెత్తిన బోనాలతో నిరీక్షించారు. అనంతరం ఆలయంలోకి చేరుకున్న భక్తులు పట్నాలు వేసిబడి బియ్యం పోసి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



చెక్‌డ్యాంను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే

మంథని రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అడవిసోమన్‌పల్లి గ్రామంలోని మానేరుపై నిర్మించిన చెక్‌డ్యాంను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మంగళవారం సందర్శించారు. నీటిలో చేపలు పడుతున్న మత్స్యకారులను కలిసి ఉపాధి వివరాలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ఆలోచన చేసి అడవిసోమన్‌పల్లిలో చెక్ డ్యాం నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. చెక్ డ్యాం బీఆర్ఎస్ పార్టీ వాళ్ల ప్రయోజనాలకే నిర్మించారని మాట్లాడారని ఆయన గుర్తు చేశారు. చెక్‌డ్యాంతో భూగర్భ జలాలు పెరిగాయని, మత్స్యసంపదతో అనేక కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయని ఆయన తెలిపారు. ఈ ప్రయోజనాలపై మంత్రి ఏమని సమాధానం చెప్తాడని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కరకట్టలు నిర్మిస్తామని ఎమ్మెల్యే అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఒక్క పని చేయలేదని, 15నెలల కాలాన్ని వృథా చేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వస్తే దానిని నిర్వీర్యం చేసేందుకు కుట్రలుచేశారని, ఈ ప్రాంత ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టును సైతం వినియోగంలోకి తీసుకురావాలని ఆయన అన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గెలుపుపై బీజేపీ సంబరాలు


సుల్తానాబాద్, గోదావరిఖని చౌరస్తాలో బీజేపీ నాయకుల సంబరాలు

సుల్తానాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపొందడంతో ఉపాధ్యాయ లోకానికి బీజేపీపై మరింత నమ్మకం ఏర్పడిందని జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి అన్నారు. మల్క కొమురయ్య గెలుపును పురస్కరించుకుని ఆ పార్టీ శ్రేణులు మంగళవారం సుల్తానాబాద్‌లో సంబరాలు జరుపుకున్నారు. సంజీవరెడ్డి మాట్లాడుతు పోటీ చేయడానికి ప్రధాన పార్టీలు ధైర్యం చేయలేని దుస్థితి ఉందని, బీజేపీ మాత్రమే ఉపాధ్యాయ ఎన్నికలను ఎదుర్కొని పోరాడి విజయం సాధించిందన్నారు. పట్టణ,మండల శాఖల అధ్యక్షులు కూకట్ల నాగరాజు, కందుల శ్రీనివాస్, నాయకులు అశోక్ రావు,సౌదరి మహేందర్ యాదవ్, తిరుపతి, వేగోళం శ్రీనివాస్ గౌడ్, కందునూరి కుమార్, తిరుపతి, పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య విజయం సాధించడంపై ఖని చౌరస్తాలో బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి మిఠాయిలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, విద్యారంగం అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమన్నారు. నాయకులు మచ్చ విశ్వాస్, భూమయ్య, కోడూరి రమేష్, సతీష్, కుమారస్వామి, నర్సయ్య, రాజ్‌కుమార్, మామిడి వీరేశం, పుష్పలత పాల్గొన్నారు. సోమారపు లావణ్య ఆధ్వర్యంలో పవర్‌హౌస్‌కాలనీలోని స్పెక్ట్రా స్కూల్‌లో స్వీట్లు పంపిణీ చేశారు. లక్ష్మీనర్సయ్య, నవీన్, అరుణ్ పాల్గొన్నారు.

ఎలిగేడు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ అభ్యర్థి మల్క కొమరయ్య గెలుపొందడంతో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్‌చౌక్‌లో బాణాసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. మండల పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మండల ఇంచార్జి రంజిత్‌రెడ్డి మాట్లాడారు. నాయకులు గర్రెపల్లి నారాయణస్వామి, మల్లారెడ్డి, కొత్తిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, అంజయ్య, శ్రీనివాస్, తిరుపతి, మనోహర్‌పాల్గొన్నారు.

ఓదెల: టీచర్స్ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య గెలుపు పట్ల బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. శనిగరపు రమేష్, శ్రీనివాస్, పుల్లూరి పృథ్వీరాజ్, కొమురయ్య, రాకేష్, పాల్గొన్నారు.

జూలపల్లి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపుపై మండల పార్టీ అధ్యక్షుడు కొప్పుల మహేష్ ఆధ్వర్యంలో నాయకులు అంబేడ్కర్ చౌరస్తాలో స్వీట్లు పంచుకుని సంబురాలు జరుపుకున్నారు. మహేష్, కంకనాల జ్యోతిబసు, రాజన్న, అశోక్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్: బీజేపీ ఎమ్మెల్సీ గెలుపుపై చందుపట్ల సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కొయ్యడ సతీష్, మచ్చగిరి రాము, మట్ట శంకర్, జంగాపల్లి అజయ్, అరుణ్, పాల్గొన్నారు.

మంథని: టీచర్స్ ఎమ్మెల్సీగా కొమురయ్య గెలుపుపై సంబరాలు జరుపుకున్నారు. జిల్లా మాజీ అధ్యక్షుడు సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రైతులను అడ్డుపెట్టుకొని రాజకీయం చేయొద్దు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ధర్మారం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) రైతులను అడ్డం పెట్టుకొని రాజకీయం చేయవద్దని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోమవారం మేడారం లెఫ్ట్ కెనాల్ సందర్శించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ రైతులను అడ్డం పెట్టుకొని రాజకీయం చేయాలను కోవడం విచారకరమన్నారు. కెనాల్ రూపకల్పన చేసిన బీఆర్ఎస్ అవగాహన రాహిత్యంతో పనులు మొదలు పెట్టిందని, కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకుండా ఒత్తిడి చేసి పనులు చేయించిదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బట్టి కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని, బీఆర్ఎస్ లాగ రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేయాలనుకోవడం లేదని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరపతిరెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో బొమ్మరెడ్డిపల్లి, కొత్తపల్లి కెనాల్‌ను ఎందుకు పూర్తి చేయాలేక పోయారో తెలుపాలని ప్రశ్నించారు. పత్తిపాకలో ప్రాజెక్ట్ కడతానని చెప్పి పల్లె నిద్ర చేసిన హరీష్‌రావు ప్రాజెక్ట్‌ను ఎందుకు పూర్తి చేయలేక పోయారో చెప్పాలన్నారు. బ్లాక్-2 అధ్యక్షుడు కోమటిరెడ్డి రవీందర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మెన్ అరిగె లింగయ్య, మాజీ ఎంపిపి కోడారి హన్మయ్య, మాజీ పిఎసిఎస్ చైర్మెన్ దేవి జనార్ధన్, సోగాల తిరుపతి, ఏఎంసీ డైరెక్టర్లు ఈదుల శ్రీనివాస్, కాంపెల్లి రాజేశం, పార్టీ సీనియర్ నాయకులు, పాలకుర్తి రాజేశం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కళ్యాణ్‌నగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని రాంమందిర్ సబ్‌స్టేషన్‌లో ఉన్న 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను 8ఎంవీఏగా మారుస్తున్నందున బుధవారం రాంమందిర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ కే వెంకటేశ్వర్లు తెలిపారు. విని యోగదారులు సహకరించాలని కోరారు.

ఎల్‌వోసీ మంజూరు

మంథనిరూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన బండి విజయ్‌ప్రసాద్ అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. రూ.లక్ష ఎల్‌వోసీని మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరు చేయించగా నాయకులు కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఎన్టీపీసీలో పటిష్ఠమైన భద్రతా వ్యవస్థ


సేఫ్టీ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

జ్యోతినగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ, తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టుల్లో పటిష్ఠమైన భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశామని, విద్యుత్ ఉత్పత్తితోపాటు ఉద్యోగుల భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని ఆ ప్రాజెక్టుల ఈడీ చందన్‌కుమార్ సామంతా పేర్కొన్నారు. జాతీయ భద్రతా దినోత్సవం(సేఫ్టీడే) సందర్భంగా ప్రాజెక్టు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఈడీ మాట్లాడారు. ఏ పరిశ్రమకైనా భద్రత వ్యవస్థ అత్యంత ప్రధానమైనదన్నారు. యాజమాన్యం ఎన్ని భద్రతా చర్యలు తీసుకున్నప్పటికీ ఉద్యోగులు భద్రతా నియమాలను పాటించాలని కోరారు. సేఫ్టీ జెండాను ఎగుర వేసి ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. జీఎంలు ఎ.కె.త్రిపాఠి, అంజనా రంజన్ డ్యాష్, సంతోష్ తిపారి, కె.సి.సింగరాయ్, సీఐఎస్ఎఫ్ డిప్యూటి కమాండెంట్ ఓవికె.శాస్త్రి, అధికారులు, ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ జవానులు పాల్గొన్నారు.

త్వరలోనే కోర్టు ఏర్పాటుకు చర్యలు


ఓదెలలో భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా మేజిస్ట్రేట్ శ్రీనివాస్

ఓదెల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో త్వరలోనే కోర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని జిల్లా మెజిస్ట్రేట్ శ్రీనివాస్ తెలిపారు. కోర్టు ఏర్పాటుకు మండల కేంద్రం నుంచి ప్రతిపాదనలో ఉన్న మూడు భవనాలను మంగళవారం జిల్లా మెజిస్ట్రేట్ శ్రీనివాస్, సుల్తానాబాద్ కోర్టు జడ్జి గణేష్ సందర్శించారు. అనంతరం విలేకరులతో జిల్లా మెజిస్ట్రేట్ శ్రీని వాస్ మాట్లాడుతూ, హైకోర్టు ఆదేశం మేరకు భవనాలను పరిశీలించా మని తెలిపారు. వీటిలో ఏదో ఒకటి భవనాన్ని ఎంపిక చేస్తామని, అలాగే ఇక్కడ కేసులన్నీ ఎక్కువ పెండింగులో ఉన్నాయి. మెజిస్ట్రేట్ వెంట జిల్లా కోర్టు ఏవో రఫీ, వకీలు అంబాల రాజు ఉన్నారు.

ఎమ్మెల్యే కనుసన్నల్లోనే ఎన్టీపీసీ బూడిద దందా


విలేకరుతో మాట్లాడుతున్న కౌశిక హరి

జ్యోతినగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ కనుసన్నల్లో ఎన్టీపీసీలో బూడిద దందా నడుస్తోందని, ఎమ్మెల్యే అనుయాయులైన కొందరు కాంట్రాక్టర్లు లారీకి 4 వేల రూపాయలు వసూలు చేస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కౌశిక హరి ఆరోపించారు. మంగళవారం ఎన్టీపీసీలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎల్కలపల్లి యాష్ పాండ్ నుంచి ఎన్టీపీసీ ఒక రూపాయికే టెండరు ద్వారా బూడిద ఇటుకల తయారీదారులకు సరఫరా చేయాల్సి ఉండగా కొందరు దళారులు ఇటుక బట్టీల పరిశ్రమల యజమానులకు రవాణా చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యేకు చెందిన 4గురు కాంట్రాక్టర్లు యాష్‌పాండ్‌లో బూడిదను మెషీన్ల ద్వారా లోడ్ చేయించి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. రోజుకు వందలాది లారీల యాష్‌పాండ్ నుంచి రవాణా చేస్తూ లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. జాతీయ రహదారి నిర్మించే కాంట్రాక్టర్లకు ఉచితంగా లోడింగు, రవాణా చేయిస్తుండగా, ఇటుకల తయారీ పరిశ్రమల యజమానులకు చార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్‌కు ఫిర్యాదు చేశామని, ఉచితంగా బూడిద నింప డంతోపాటు రవాణా ఖర్చులు చెల్లించాలని కోరినట్లు చెప్పారు. 115 మంది టెండరు దారులకు బూడిద రవాణాకు అనుమతి తోపాటు స్థానిక లారీలలోనే రవాణా చేసేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బూడిద అక్రమ దందా విషయంలో రాజకీయాలకు అతీతంగా ప్రతి నాయకుడు, ప్రజలు స్పందించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, బుర్ర శంకర్ గౌడ్, రాంబాబు, ప్రవీణ్, శంకర్, సతీష్ పాల్గొన్నారు.

కస్తూర్బాను తనిఖీ చేసిన డీఈవో

రామగిరి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను మంగళవారం డీఈవో మాధవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన బోధనను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం, డైనింగ్, కిచెన్ హాల్‌ను తనిఖీ చేపట్టారు. కళాశాల ప్రిన్స్‌పాల్ మంజుల, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కళ్యాణ్‌నగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రామగుండం ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. మంగళవారం ప్రజాపాలనలో భాగంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ప్రజలు వివిధ సమస్యలను విన్నవించారు. ఎమ్మెల్యే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. ఆరోగ్యశ్రీ కార్డులు లేని వారికి బీపీఎల్ కార్డు ఇవ్వాల్సిందిగా తహసీల్దార్ కుమారస్వామిని ఆదేశించారు. కన్నాల గ్రామానికి చెందిన పలువురు నిరుద్యోగులు మెడికల్ కళాశాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరగా వారికి విద్యార్హతలను బట్టి కల్పిస్తానని హామీ ఇచ్చారు.

స్కానింగ్, ఫెర్టిలిటీ సెంటర్ల తనిఖీ

కోల్‌సిటీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక బృందాలు మంగళవారం తనిఖీలు జరిపాయి. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి అన్న ప్రసన్న కుమారితో పాటు కుటుంబ సంక్షేమ, ప్రజారోగ్యశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన అధికారులు లోటస్ స్కానింగ్ సెంటర్, విజయ ఫెర్టిలిటీ సెంటర్‌లో తనిఖీలు జరిపారు. గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం అమలు పర్యవేక్షణలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా వైద్య, ఆరోగ్యశాఖ స్పెషల్ డ్రైవ్ చేపట్టిందని, జిల్లాలో తనిఖీలు చేస్తున్నట్టు డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు. స్కానింగ్ సెంటర్లు, మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ(ఎంటీపీ) చేసే ఆసుపత్రుల నిర్వాహకులు లింగ నిర్ధారణ చేసినా, చట్ట విరుద్ధ గర్భస్రావాలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని, జరిమానాతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీరాం, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, గైనకాలజీ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతి, డాక్టర్ వాణిశ్రీ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ద్వారా పథకాలను అందించాలి

కళ్యాణ్‌నగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగంలో పని చేసే కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా పథకాలను అందించే విధంగా ప్రభుత్వం చూడాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నరేష్ కోరారు. మంగళవారం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గోదావరిఖని ఏఎల్‌ఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ రంగ కార్మికులు పనులు దొరకక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పని స్థలంలో రక్షణ కరువైందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు రిజిస్ట్రేషన్ చార్జి మాత్రమే వసూలు చేయాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ప్రమాద బీమా కింద రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 57సంవత్సరాలు నిండిన వారికి రూ.10వేలు, ప్రమాదలకు గురైన కార్మికులకు అన్నీ ఖర్చులు బోర్డే భరించాలని డిమాండ్ చేశారు. అశోక్, ఎల్లయ్య, రాజేశం, మల్లేష్, దుర్గయ్య, రవికుమార్, రాయనర్సు, రాజమొగిలి, నాగభూషణం, రాజయ్య పాల్గొన్నారు.

ఆర్జీ-3లో మహిళలకు ఆటల పోటీలు

రామగిరి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో సీఎస్‌సిపిఏ క్లబ్‌లో నిర్వహించిన ఆటల పోటీలను సేవ అధ్యక్షురాలు అలివేణి సుధాకర్‌రావు ప్రారంభించారు. పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈనెల 8న కమ్యూనిటి హాల్‌లో నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విజేతలకు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. డిప్యూటీ పర్సనల్ మేనేజర్ గుర్రం శ్రీహరి, నిర్వాహకులు సుధాకర్, నాగరాజు, లేడీస్‌క్లబ్ సభ్యులు హరిణి పాల్గొన్నారు.

ఘనంగా సింగరేణి స్కూల్ వార్షికోత్సవం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రెటరీ

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సెక్టార్-3 సింగరేణి హైస్కూల్ 48వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రెటరీ గుండా శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉద్యోగుల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని సీబీఎస్‌ఈ సెలబస్‌ను రానున్న విద్యాసంవత్సరం నుండి సెక్టార్-3 పాఠశాలలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకుని ఉత్తమ పౌరులుగా నిలవాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ అనిల్‌కుమార్‌తో పాటు ఉపాధ్యాయ బృందం, పోషకులు పాల్గొన్నారు.

పద్మశాలి మహాసభలను విజయవంతం చేయాలి

మంథని, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి ప్రజల సమస్యల పరిష్కారానికి ఈనెల 17న హైదరాబాద్‌లోని నిర్వహించే మహాసభలను విజయవంతం చేయాలని పద్మశాలి సంఘం జిల్లా హడ్‌హక్ కమిటీ చైర్మన్ వలస నీలయ్య పిలుపునిచ్చారు. కర పత్రాలను మంగళవారం అవిష్కరించారు లక్ష్మీనారాయణ, చందు, శ్రీనివాస్, పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): పద్మశాలి సభను విజయవంతం చేయాలని జిల్లా అడహక్‌కమిటీ చైర్మన్ వల్స నీలయ్య పేర్కొన్నారు. మంగళవారం పద్మశాలి మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు.

కోల్‌సిటీటౌన్,(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ మైదానంలో ఈనెల 9వ తేది జరుగనున్న పద్మశాలి సభలను విజయవంతం చేయాలని పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు బండారి రాయమల్లు, జిల్లా అడహక్‌కమిటీ చైర్మన్ వలస నిలయ్య బూర్ల లక్ష్మీనారాయణ కోరారు. మంగళవారం గోదావరిఖని మార్కండేయకాలనీలోని శివాలయంలో మహాసభలను విజయవంతం చేయాలని కరపత్రాలను విడుదల చేశారు. గుండేటి రాజేష్, చందు, వడ్డేపల్లి దినేష్, ఆర్ఎస్‌మూర్తి, నర్సయ్య, శంకర్, శ్రీనివాస్, బొద్దుల వేణు, కన్నం ప్రభాకర్, పాల్గొన్నారు.

పాఠశాలలో వీడ్కోలు సమావేశం

ముత్తారం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ధరియాపూర్ ఆదర్శ పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో సురేష్, ఎంపీవో గోవర్ధన్ మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ప్రిన్సిపాల్ సంతోష్ పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు వసూలు చేయాలి

మంథని, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అన్ని పంచాయతీల్లో వంద శాతం పన్నుల వసూలు పూర్తి చేయాలని డీఎల్‌పీవో సతీష్ సూచించారు. కార్యదర్శులతో మంగళవార సమీక్షించారు. ఎంపీడీవో శశికళ, ఎంపీవో శేషయ్యసూరి, మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆసక్తి ఉన్న వారందరికీ ఉపాధిహామీ పనులు


ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో

సుల్తానాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆసక్తి ఉన్న వారందరికీ ఉపాధిహామీ పథకం ద్వారా పనులు కల్పిస్తామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కాళిందినీ దేవి అన్నారు. సుద్దాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను డీఆర్‌డీఓ మంగళవారం పరిశీలించారు. వారికి తగిన సలహాలు అందించారు. నిబంధనల మేరకు పనులు చేసుకోవాలని రోజుకు మూడు వందల కూలీని పొందాలని సూచించారు. ప్రస్తుతం వ్యవసాయ కూలీలకు పనులు ఉండవని, ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌కార్డులు కలిగి ఉన్న వారందరూ పనుల కోసం ఆయా గ్రామా లలో మండల కేంద్రంలో కానీ ఉపాధి హామీ అధికారులను సంప్రదించాలన్నారు. అనంతరం సుల్తానాబాద్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్‌లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను పరిశీలించారు. క్యాంటీన్‌లో శుభ్రత పాటించాలని, తినుబండారాలను రుచిగా తయారు చేయాలని సూచించారు. డీఆర్‌డీఓ వెంట ఎంపీడీవో నీలగిరి దివ్యదర్శన్‌రావు, ఏపీఓ మల్లీశ్వరి, జేఈ రాజ్‌కుమార్, కార్యదర్శి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాదరావు స్మారక అవార్డు ప్రదానం

కోల్‌సిటీటౌన్ , మార్చి 4(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల కరీంనగర్‌లో జరిగిన శ్రీపాదరావు జయంతి వేడుకల్లో గోదావరి కళా సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కనకం రమణయ్య శ్రీపాదరావు స్మారక అవార్డు అందుకున్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఫోక్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు కృపాదానం చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. సింగరేణి అధికారులు, ఉద్యోగులు, నాయకులు, కళాకారులు అభినందనలు తెలిపారు.

చిన్నారులకు అండగా వీహెచ్‌ఆర్

కోల్‌సిటీటౌన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ అండగా నిలిచింది. రామగుండం కార్పొరేషన్ 33వ డివిజన్‌కు చెందిన తోటపల్లి రాజేందర్-స్వప్న దంపతులు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. అనాథలైన వారి నలుగురు పిల్లల పరిస్థితి తెలిసిన వెంటనే వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వ్యాళ్ళ హరీష్‌రెడ్డి రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్(డి) పార్టీలో చేరిక

కోల్‌సిటీటౌన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ వాసంపల్లి ఆనంద్‌బాబు ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేసి తెలంగాణ రక్షణ సమితి(డి) పార్టీలో చేరారు. పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తోడేటి శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో పార్టీ అధ్యక్షుడు నరాల సత్యనారాయణ ఆనంద్‌బాబుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కనుకుంట్ల రమేష్, ఈదునూరి నర్సింగ్, ఎం.శ్రీనివాస్, శివ, రమేష్ పాల్గొన్నారు.

ఖని డీఎంను సన్మానించిన ఉద్యోగులు


డీఎం నాగభూషణంను సన్మానిస్తున్న ఉద్యోగులు

కళ్యాణ్‌నగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఆర్‌టీసీ డిపో మేనేజర్ నాగభూషణంను మంగళవారం డిపో ఆవరణలో ఆర్‌టీసీ ఉద్యోగులు సన్మానించారు. ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఉద్యోగులకు పవర్ ట్రైనీ శిక్షణ తరగతుల్లో ఉద్యోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలు, యాక్సిడెంట్లు లేకుండా ప్రయాణీకులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చే విషయంలో డిపో మేనేజర్ ఇచ్చిన తరగతులు ఉత్సాహాన్ని నింపాయని సిబ్బంది తెలిపారు. ఎస్ఎన్ చార్రి, శ్రీధర్, డేవిడ్, కేటీ రెడ్డి పాల్గొన్నారు.

రెండు రోజులు ఫ్లెక్సీ షాపులు బంద్

కళ్యాణ్‌నగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఫ్లెక్సీ ప్రింటింగ్ షాపులను రెండు రోజులు మూసివేయనున్నట్లు అధ్యక్షుడు ఒల్లాల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గండ్ర జగన్మోహర్‌రావు తెలిపారు. మంగళవారం గోదావరిఖనిలో జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఒల్లాల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గండ్ర జగన్మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు పూసాల రామకృష్ణ, సహాయ కార్యదర్శి రాకేష్, కమిటీ సభ్యులుగా 16 మందిని ఎన్నుకున్నారు. అధ్యక్షుడు మాట్లాడుతూ రోజు రోజుకు పెరుగుతున్న ముడిసరుకుల ధరలను నిరసిస్తూ ఈనెల 6 నుంచి రెండు రోజులు బంద్ పాటిస్తున్నట్లు తెలిపారు.

ఎల్ఆర్ఎఫ్ ఫీజు చెల్లించండి

కోల్‌సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అనధికారిక లే అవుట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు ఎల్ఆర్ఎస్ ఫీజును ఈ నెల 31లోపు చెల్లించాలని కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ ఒక ప్రకటనలో కోరారు. 31వ తేదీలోపు ఫీజు చెల్లిస్తే 25శాతం రాయితీ ఉంటుందన్నారు. వివరాలకు 6302973409, 9182309215, 9398130997లలో సంప్రదించాలని ఆమె కోరారు.

నియామకం

కోల్‌సిటీటౌన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ గోదావరిఖని నగర కాంగ్రెస్ కమిటీ జాయింట్ సెక్రెటరీగా అనుమాండ్ల నవీన్‌కుమార్ నియమితులయ్యారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ నవీన్ కుమార్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, నాయకులు మహంకాళిస్వామిలతో పాటు సీనియర్ నాయకులకు నవీన్ కృతజ్ఞతలు తెలిపారు.

రక్తం అందించిన తహసీల్దార్

అంతర్గాం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయ పూజారి రాఘవాచారి తల్లి అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమెకు రక్తం అవసరం ఏర్పడింది. విషయం తెలిసిన తహసీల్దార్ రవీందర్ పటేల్ రెడ్‌క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షుడు కావడంతో కరీంనగర్ నుంచి ఏబీ పాజిటివ్ రక్తం తీసుకుని వచ్చి బాధితురాలి ప్రాణాలు కాపాడారు.

గ్రామపంచాయతీ ఆదాయం పెంచుకోవాలి

ఎలిగేడు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీల ఆదాయం పెంచుకోవలసిన అవసరం ఉందని ఎంపీడీవో భాస్కర్‌రావు అన్నారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్, లైబ్రరీసెస్, ఎల్ఆర్ఎస్ దరఖాస్తు ఫీజు వసూలు, ట్రేడ్ లైసెన్స్‌ల వసూలు చేయాలని ఆయన ఆదేశించారు. ఎంపీవో ఎండి.ఆరీఫ్, ఎపీవో సదానందం, కార్యదర్శులు శివకుమార్, మహేష్, అంజలి, పాపన్న, హరిబాబు, సురేష్, శిరీష, శ్రవణ్‌కుమార్ ఆపరేటర్స్ పాల్గొన్నారు.

ప్రతి నెలా వేతనాలు చెల్లించాలి

పెద్దపల్లిటౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికులు, ఉద్యోగుల వేతనాలు ప్రతీ నెల గ్రీన్ చానెల్ ద్వారా చెల్లించాలని సీఐటీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సీపెల్లి రవీందర్ ప్రభుత్వాన్ని కోరారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించి, పెండింగ్ వేతనాల అమలు, ఎస్టీఓలో ఆగిపోయిన వేతనాలు చెల్లించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని సూచించారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఒక్కపూట పని కల్పించాలన్నారు. ఎండి కాజా, లచ్చయ్య, శ్రీనివాస్, రాజయ్య, అంబాల లక్ష్మణ్, పాల్గొన్నారు.

ఉచిత కుట్టుమిషన్లకు దరఖాస్తులు సమర్పించాలి

పెద్దపల్లి కల్చరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఉచిత కుట్టు మిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్న మైనార్టీ మహిళలు దరఖాస్తు కాపీలను ఈనెల 6వ తేదీలోపు సమర్పించాలని జిల్లా ఇంచార్జి మైనార్టీ సంక్షేమశాఖ అధికారి జె.రంగారెడ్డి మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ మహిళాశక్తి పథకం ద్వారా ఉచిత కుట్టుమిషన్లు అందిస్తున్నారని, డిసెంబర్ 16నుంచి 31వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని కాపీలు ఇవ్వని అభ్యర్థులు దరఖాస్తు ఫారంతో పాటు పత్రాలను జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

పారిశుధ్య పనులు పరిశీలించిన డీఎల్‌పీవో

మంథనిరూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సిరిపురం గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులను మంగళవారం డీఎల్‌పీవో సతీష్‌కుమార్ పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, దోమల నివారణ చర్యలు తీసుకోవాలని, నీటి ఎద్దడి లేకుండా సరఫరా పై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కాకర్లపల్లిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీవో శశికళ, ఏపీవో సదానందంలు పరిశీలించారు. కూలీలకు పలు సూచనలు అందజేశారు.